నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, శనివారం 19 ఏప్రిల్ 2025 | KAMAREDDY

ఖండ్‌గావ్ ఇసుక క్వారీలో లోతుగా తవ్వడంతో ఏర్పడిన గుంతలు

జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డూఅదుపులే కుండా పోతున్నది. బోధన్ విడిజన్‌లోని మంజీరా నది ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగు తున్నాయి. ఇసుకాసురులు నిబంధనలకు క్వారీలు నిర్వ హిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతు న్నారు.ఇసుక క్వారీల నిర్వహణలో పాటించాల్సిన అన్ని రకాల పరిమితులను అతిక్రమిస్తున్నారు. మంజీరా తీరంలోని అన్ని ఇసుక క్వారీల్లోనూ అక్రమాలు యథే చ్ఛగా కొనసాగడం గమనార్హం. పెద్దక్వారీగా పేరుగాం చిన ఖండ్‌గావ్ క్వారీలో ఇసుక దోపిడీకి అడ్డూఅదుపులే కుండా పోతున్నది. సెలువు దినమైన గుడ్‌ఫ్రైడే రోజున కూడా ఇసుక తవ్వకాలు చేపడుతుండడం 'నమస్తే తెలం గాణ' కంటపడింది. క్షేత్రస్థాయిలో పర్యటించగా విస్తు పోయే వాస్తవాలు వెలుగుచూశాయి.

–బోధన్, ఏప్రిల్ 18

మంజీరను తోడేస్తున్నారు..

ఖండ్‌గావ్ క్వారీలో అక్రమాల జాతర

- యథేచ్ఛగా జేసీబీతో ఇసుక తవ్వకాలు
- సెలవురోజుల్లోనూ ఆగని అక్రమ దందా
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- నదీ గర్భాన్ని చీల్చు తున్న ఇసుకాసురులు
- తగ్గుపోతున్న భూగర్భ జలాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానిక రైతులు
- పట్టించుకోని రెవెన్యూ, పోలీసు అధికారులు
- 'నమస్తే విజిట్'లో వెలుగుచూసిన విస్తుపోయే వాస్తవాలు

బోధన్ డివిజన్‌లో కొన్ని నెలలుగా నిర్వహి స్తున్న ఖండ్‌గావ్ క్వారీ నిర్వాహకులు రెచ్చిపోతున్నారు. అడ్డూ అదుపులేకుండా మంజీరాలో తవ్వకాలు చేపడుతూ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నా రు. వందలాది టిప్పర్లు, లారీల్లో ఇసుకను పరిమితికి మించి నింపు తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. నియోజకవ ర్గంలో 'పెద్దాయన' సపోర్టు తమకు ఉన్నదనే భావనతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సెలవు రోజుల్లో కూడా ఇసుక క్వారీలో తవ్వకాలు చేపట్టడం గమ నార్హం. గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ సెలవు ఉన్నప్పటికీ ఖండ్‌గావ్ క్వారీలో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా చేపట్టారు. ఈ తతంగమంతా క్వారీ పరిశీలనకు వెళ్లిన 'న మస్తే తెలంగాణ' కంటపడింది. తమ కు ఎదురే లేదన్నట్లుగా మంజీర మధ్య భాగంలో ఇసుక తవ్వకాలు చేపడుతూ కుప్పలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జేసీబీతో తవ్వకాలు చేపడుతుండడం కనిపించింది. నిబంధనల ప్రకారం మంజీరా నదిలోని క్వారీలో ఇసుక తవ్వకాలకు జేసీబీలను వాడరాదు. సెలవు రోజే కదా.. ఎవరు చూస్తారులే అనుకున్నారేమో నిర్వాహకులు. యథే చ్ఛగా జేసీబీతో తవ్వకాలను ప్రారంభించారు. ప్రభుత్వ సెలవు దినాల్లోనూ ఇలాగే జేసీబీలతో ఇసుక తవ్వకాలు చేపడుతున్నట్లు తెలిసింది. సెల వుల అనంతరం ఇసుకను టిప్పర్లు, లారీల్లో లోడ్ చేసి తరలిస్తున్నారు.

వే బిల్లులు లేకున్నా..జోరుగా తవ్వకాలు

నిబంధనల ప్రకారం ప్రభుత్వ సెలవు దినాల్లో రెవెన్యూ అధికారులు ఇసుక వాహనాలకు వే బిల్లులు మంజూరుచేయరు. ఇసుక క్వారీల వద్ద రెవెన్యూ సిబ్బంది కూడా అందుబాటులో ఉండరు. రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ లేని సెలవు దినాల్లో క్వారీ నిర్వాహకులు నదీగర్భంలో ఇసుక తవ్వకాలు చేపట్ట రాదు. కానీ వే బిల్లులు జారీచేసే రోజుల్లో కూడా ఈ క్వారీలో ఇసుక తవ్వకాల్లో నిబంధనలను పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ఇసుక తవ్వకాలు, లోడింగ్ చేయడం కూలీల ద్వారా జరగాలి.. ఇది ప్రభుత్వ క్వారీ అయినందున క్వారీ నిర్వహణలో ప్రైవేట్ వ్యక్తుల అజమాయిషీ ఎంతమాత్రం ఉండకూడదు. అయితే, ఇక్కడ మాత్రం ప్రైవేట్ వ్యక్తులు పెత్తనం సాగిస్తున్నట్లు తెలి సింది. అజమాయిషీ చేయాల్సిన రెవెన్యూ సిబ్బంది నిబంధనల ఉల్లంఘనలను ఏమాత్రం పట్టించుకోవ డంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లోతుగా తవ్వకాలు.. అడ్డుగంటుతున్న భూగర్భ జలాలు

ఖండ్‌గావ్ క్వారీతో పాటు మంజీరా తీరంలోని క్వారీల్లో ఇసుక తవ్వకాల్లో నిబం ధనలను తుంగలోకి తొక్కుతున్నారు. ఇసుక పరి మాణం ఆధారంగా ఒకటిన్నర మీటరు నుంచి రెండు న్నర మీటర్ల లోతు వరకు తవ్వకాలు చేపట్టాలి. ఎంత లోతువరకు తవ్వకాలు చేపట్టాలో మైనింగ్‌శాఖ నిర్దేశిస్తుంది. కానీ ఖండ్‌క్వారీతో సహా మిగతా క్వారీల్లో ఈ నిబంధనను ఉల్లంఘిస్తున్నారు. ఖండ్‌గావ్ క్వారీలో పరిమితికి మించి ఎక్కువ లోతు వరకు తవ్వకాలు చేపడుతున్నారు. దీంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. ఈ గుంతలు కనిపించకుండా ఎప్పటిక ప్పుడు పూడ్చేస్తున్నట్లు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఇలా లోతుగా ఇసుక తవ్వకాలు చేపడుతుండడంతో భూగర్భజలాలలు అడుగంటిపోతున్నాయని రైతులు ఆందో ళన చెందుతున్నారు. ఇంతే కాకుండా టిప్పర్లు, లారీల్లో పరిమితికి మించి ఇసుకను నింపుతు న్నారు. ఇలా ఓవర్‌లోడ్ ఇసుక వాహనాలతో ప్రభుత్వం ఆదాయానికి గండి పడుతున్నది. ఒక్కో టిప్పర్‌లో 15 టన్నులు (10 క్యూబిక్ మీటర్లు) లోడ్ వేయాల్సి ఉండగా, ఇక్కడ మాత్రం ఏకంగా 21 టన్నుల (14 క్యూబిక్ మీటర్లు) ఇసుకను నింపుతున్నారు. కోట్లాది రూపాయల ఆదాయం కోల్పోతున్నప్పటికీ, పోలీస్, రెవెన్యూ అధికా రులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండడం గమనార్హం. ఈ విషయమై బోధన్ తహసీల్దార్ విఠల్‌ను 'నమస్తే తెలంగాణ' వివరణ అడగగా... నది మధ్యలో జేసీబీతో ఇసుక తవ్వకాలు చేపడుతామని, ఒకవేళ చేపడితే విచారణ నిర్వహిస్తామని తెలి పారు.

ప్రభుత్వ సెలవు ఉన్నప్పటికీ శుక్రవారం ఖండ్‌గావ్ క్వారీ వద్ద మంజీరా నదిలో జేసీబీతో కొనసాగుతున్న ఇసుక తవ్వకాలు

కేసీఆర్ సన్నాహక సమీక్ష

ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో పార్టీ అధినేత కేసీఆర్ శుక్రవారం ఎర్రవెల్లిలో సమీక్ష నిర్వహించారు. సభలో మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, సభ విజయ వంతంలో వారి భాగస్వామ్యం, అనుసరించాల్సిన వ్యూహాలు, కార్యాచరణకు సంబంధించి తగు సూచ నలు చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన మహిళా నేతలు సుమిత్రానంద్, గడ్డం సుమనారెడ్డి, విశాలినీరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాపాలన పేరుతో రాక్షస పాలన

ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తే దాడులు చేస్తారా?
సునీల్‌రెడ్డి పొద్దున ప్రెస్‌మీట్‌లో చెబుతారు..
పోలీసులు సాయంత్రం కేసులు పెడతారు..
అక్రమ కేసులు..లాఠీదెబ్బలతో భయపెట్టలేరు
మా ఆత్మస్థైర్యాన్ని, ధైర్యాన్ని వమ్ము చేయలేరు
రెట్టింపు కసితో ప్రజల పక్షాన పోరాడుతాం
మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, ఏప్రిల్ 18: కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ప్రజాపాలన తెస్తామని చెప్పా రని, కానీ బాల్కొండ నియోజకవ ర్గంలో ప్రజాపాలన పేరుమీద రాక్షస పాలన సాగుతున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఎన్ని కల్లో ఇచ్చిన హామీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దాడు లకు తెగబడుతున్నారని మండిపడ్డారు. అక్రమ కేసులు, దాడులతో భయపెట్టాలని చూడడం అదంతా అధికార పార్టీ నేతల అపోహ మాత్రమే అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులను పోలీ సులే కొట్టి, వారే కేసులు పెడతారని, ఇది ప్రజాపా లనా లేక పోలీసు పాలనా అని ప్రశ్నించారు. ఇటీవల భీమ్‌గల్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి పర్యటన సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులపై కాంగ్రెస్ కార్యక ర్తల దాడులు, పోలీసు లాఠీచార్జి, అక్రమ కేసుల నమోదు తదితర పరిణామాలపై వేముల శుక్రవారం సోషల్ మీడియా వేదికగా మాట్లాడారు. ఇటీవల భీమ్‌గల్‌కు వచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారావును కల్యాణలక్ష్మి చెక్కులతోపాటు ప్రభుత్వం ఇస్తానన్న తులం బంగారం, ప్రతి మహిళకు రూ.2500, వృద్ధు లకు, బీడీకార్మికులకు రూ.4వేలు ఎప్పుడిస్తారని అడి గామని తెలిపారు. నియోజకవర్గంలో ఇంకా 31వేల మంది రైతులకు రుణమాఫీ చేయాల్సి ఉన్నదని, ఎప్పుడు చేస్తారని, రైతుభరోసా ఎందుకు వస్తలేదని, బోనస్ ఎందుకు ఇవ్వడంలేదని అడిగినట్లు చెప్పారు. రైతుభరోసాను ముఖ్యమంత్రి మార్చి 31 లోపు వేస్తామని చెప్పారని, ఇప్పటికీ రైతుల ఖాతాలో ఆ డబ్బులు ఎందుకు జమకాలేదని, ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలుచేస్తారని అడిగితే సభలోపల కాంగ్రెస్ నాయకులు గొడవకు దిగారని తెలిపారు. ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలుచేస్తారని సభ బయట ప్లకార్డులు పట్టుకొని శాంతియుతంగా నిర సన తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులపై కాంగ్రెస్ కార్య కర్తలు దాడులు చేయగా.. పోలీసులు విచక్షణా రహి తంగా లాఠీచార్జి చేయడం అమానుషమన్నారు.

అక్రమ కేసులు పెట్టించిన సునీల్‌రెడ్డి

తమ పార్టీ కార్యకర్తలపై బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి అక్రమ కేసులు పెట్టించాడని ఆరోపించారు. సునీల్‌రెడ్డి కేసులు పెట్టా లని ప్రెస్‌మీట్‌లో చెప్పగానే, పోలీసులు ఆగమేఘాల మీద బీఆర్ఎస్ కార్యకర్తలు, తనతోపాటు 33 మందిపై అక్రమకేసులు నమోదు చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీసులే కొడతారని, వారే కేసులు పెడతారని ఇదేం పాలనా అని ప్రశ్నించారు. ప్రభు త్వం ఇచ్చిన హామీలను అమలుచేయాలని అడగడం ప్రతిపక్షపార్టీగా తమ బాధ్యత అని, అందులో తప్పే ముందని అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు లాఠీ దెబ్బలు తిన్నది వారి ఇంటి కోసం, వారి అవసరాల కోసం కాదని.. ప్రజలు, మహిళలు, రైతులు గుర్తిం చాలని సూచించారు. కాంగ్రెస్ కార్యకర్తలు ప్రభుత్వ పెద్దలు, పోలీసులు ఎన్ని కేసులు పెట్టినా, తమ ఆత్మ స్థైర్యాన్ని, ధైర్యాన్ని దెబ్బతీయలేరని, ఇంతకు రెట్టింపు ఉత్సాహంతో, కసితో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేదాకా పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. లాఠీ దెబ్బలతో తమను భయపెట్ట లేరని, తమ పోరాటానికి నియోజకవర్గ ప్రజలు, మహిళలు, రైతన్నలు అండగా నిలువాలని మనస్పూ ర్తిగా కోరుకుంటున్నారని అన్నారు.

శంకుస్థాపన చేసిన పనులకే మళ్లీ శంకుస్థాపన?



చీమన్‌పల్లి పీహెచ్‌సీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు (ఫైల్)

- **పాత అభివృద్ధి పనులకే.. మళ్లీ ప్రారంభోత్సవాలు!**
- **సిరికొండ మండలం చీమన్‌పల్లి పీహెచ్‌సీ నిర్మాణ పనులకు మరోసారి శంకుస్థాపన**

ధర్పల్లి/ సిరికొండ, ఏప్రిల్ 18: బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో ప్రారంభించిన పనులకే మళ్లీ శంకుస్థాపన చేస్తుండడం రూరల్ నియో జకవర్గంలో చర్చనీయాంశమైంది. ఇందల్వా యి మండలంలో రెండు బ్రిడ్జిలు, ధర్పల్లి మండలంలోని వాడి వద్ద బ్రిడ్జి నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి స్థానిక ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నిధులు మంజూ రుచేసి పనులు చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రస్తుత ఎమ్మెల్యే భూపతిరెడ్డి మళ్లీ శిలాఫలకాలు వేసి పనులు చేపట్టడంపై ప్రజలు అవాక్కవుతున్నారు. సిరికొండ మండలం చీమన్‌పల్లిలో పీహెచ్‌సీ నిర్మాణం చేపట్టాలని బీఆర్ఎస్ హయాంలోనే నిర్ణయించారు. పీహె చ్‌సీ నిర్మాణానికి అప్పటి ఆర్థిక మంత్రి హరీశ్ రావు వచ్చి శంకుస్థాపన కూడా చేశారు. తాజాగా శుక్రవారం చీమన్‌పల్లిలో పీహెచ్‌సీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూపతిరెడ్డి మళ్లీ శంకుస్థాపన చేయడం గమనార్హం. అయితే, గతంలో కేటాయించిన స్థలంలో కాకుండా మరోచోట పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తుండడం చర్చనీయాంశమైంది. పాత పనులకే మళ్లీ శిలా ఫలకాలు వేస్తూ ప్రజలను మోసం చేయ కుండా నిధులు తీసుకువచ్చి కొత్తగా అభివృద్ధి పనులు చేపడితే తాము స్వాగతిస్తామని మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ పేర్కొన్నారు.

కాటేసిన న్యుమోనియా

- **గంటల వ్యవధిలో ఇద్దరు చిన్నారుల మృతి**
- **అక్కాచెల్లెళ్ల ఇండ్లల్లో అంతులేని విషాదం**

గణేశ్, నవ్య(ఫైల్)

నందిపేట్, ఏప్రిల్ 18: న్యుమోనియా ఇద్దరు చిన్నారులను కాటేసింది. అక్కాచెల్లెళ్ల కుటుంబాల్లో అంతులేని విషాదం నింపింది. గంటల వ్యవధి లోనే చెల్లెలి కూతురు, అక్క కుమారుడు మృతి చెందిన ఘటన నందిపేట్ మండలంలో శుక్రవారం చోటు చేసుకున్నది. నవీపేట్ మండలం ఫకీరాబాద్ గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లకు గతంలో వివాహాలు జరిగాయి. అక్క లావణ్యను బజార్‌కొత్తూర్ వాసి సాయినా థ్‌కు, చెల్లెలు శ్యామలను సీహెచ్.కొండూర్‌కు చెందిన గోపికి ఇచ్చి వివాహం జరిపించారు. గోపి, శ్యామల దంపతుల కుమార్తె నవ్యశ్రీ (6 నెలలు), లావణ్య, సాయినాథ్ దంపతుల కుమారుడు గణేశ్ (8 నెలలు) నాలుగైదు రోజులుగా న్యుమోనియాతో బాధ పడుతున్నారు. చిన్నారులకు దవాఖానలో చికిత్స చేయించారు. అయితే, నవ్యశ్రీ కోలుకుంటుందని అనుకుంటున్న తరుణంలో శుక్రవారం మళ్లీ అస్వస్థతకు గురైంది. దీంతో 108 వాహనంలో దవాఖానకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందింది. చెల్లెలి బిడ్డ అంత్యక్రియలకు హాజరైన లావణ్య ఇంటికి వెళ్లే సరికి కుమారుడు కూడా అస్వస్థతకు గురయ్యాడు. చూస్తుండగానే బాలుడు కన్నుమూశాడు. గంటల వ్యవధిలోనే ఇద్దరు చిన్నారులు మృత్యువాత పడ డంతో కుటుంబ సభ్యులు గుండెలు బాదుకున్నారు.

ఈదురు గాలుల బీభత్సం

- **పలు మండలాల్లో అకాల వర్షం**
- **నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు**
- **పిడుగుపాటుకు 40 గొర్రెలు మృత్యువాత**

శివారు రాంరెడ్డిపల్లిలో ఓ ఇంటి పైనుంచి కొట్టుకుపోయిన రేకులు

ఇప్రోజివాడి గ్రామంలో పిడుగుపాటుకు మృతిచెందిన గొర్రెలు

బీబీపేట్/మోర్తాడ్/ధర్పల్లి/ కామారెడ్డి రూరల్, ఏప్రిల్ 18: ఉమ్మడి జిల్లాలో శుక్రవారం అకాల వర్షంతోపాటు ఈదురుగాలులు బీభత్సం సృష్టిం చాయి. దీంతో పలు గ్రామాల్లో చెట్లు నేలకొరి గాయి. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలపై చెట్లు కూల డంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్ప డింది. బీబీపేట మండలం శివారు రాంరెడ్డిపల్లి గ్రామంలో పంచాయతీ సిబ్బంది బక్క ప్రవీణ్ ఇంటి రేకులు గాలి కొట్టుకుపోయాయి. పెండ్లి కోసం తీసువచ్చిన రూ.40 వేలు లెక్కపెడుతుండ డంతో గాలికి డబ్బులు కూడా కొట్టుకుపోవడంతో కుటుంబీకులు బోరుమని విలపించారు. తుజాల్ పూర్, యాడారం, బీబీపేట, మాందాపూర్, జన గామ తదితర గ్రామాల్లో మామిడికాయలు రాలి పోగా, వరి పంట నేలకొరిగిందని ఆయా గ్రామాల రైతులు తెలిపారు. మోర్తాడ్ మండలం ఉప్లూర్ శివారులోని వడ్డెరకాలనీ ప్రాంతం, నాగాపూర్ శివారులోని వ్యవసాయక్షేత్రంలో విద్యుత్ స్తం భాలు విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఏర్పడింది. ధర్పల్లి మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయడానికి ధాన్యాన్ని సిద్ధంగా ఉంచుకోగా..వర్షానికి తడ వకుండా కాపాడుకోవడానికి నానా పాట్లు పడ్డారు.

పిడుగుపాటుకు 40 గొర్రెలు మృతి

కామారెడ్డి మండలం ఇప్రోజివాడి గ్రామంలో శుక్ర వారం పిడిగుపాటుకు 40 గొర్రెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన కడారి దేవయ్య రోజు మాదిరిగానే గొర్రెలను మేతకు తీసుకెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో మందపై పిడుగులు పడగా 40కి పైగా గొర్రెలు మృత్యువాత పడ్డాయి. రూ.5 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

క్రైస్తవులు పవిత్రంగా భావించే గుడ్ ఫ్రైడేను శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉమ్మడి జిల్లాలోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థ నలు చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్‌లో ఉన్న సీఎస్ఐ సెంటినరీ చర్చిలో ఫాదర్లు బైబిల్ వాక్యబోధన చేసి గుడ్‌ఫ్రైడే ప్రాధాన్యతను వివరించారు. –కంఠేశ్వర్, ఏప్రిల్ 18

తూకంలో మోసం!

- **బస్తాకు రెండు కిలోలు అదనంగా తూకం**
- **రైతుల ఆందోళన**
- **కాంటా మిషన్‌లో లోపమని అధికారుల వెల్లడి**

కామారెడ్డి, ఏప్రిల్ 18 : కామారెడ్డి మం డలం శాబ్దిపూర్ గ్రామంలో తూకంలో మోసం చేస్తున్నారని ఆరో పిస్తూ రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. శాబ్దిపూర్ గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో బస్తాకు రెండు కిలోల ధాన్యం ఎక్కు వగా తూకం చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆరుగాలం కష్టపడి ధాన్యాన్ని పండిస్తే అధికా రులు తమ పొట్టకొడుతున్నారని ఆందోళన చేపట్టారు. విషయం తెలు సుకున్న సొసైటీ అధికారులు కొను గోలు కేంద్రానికి వచ్చి కాంటా చేసే యంత్రాన్ని సరిచేస్తామని చెప్ప డంతో రైతు లు శాంతించారు. ఈ విషయమై ఇన్‌చార్జి కార్యదర్శి సతీ శ్‌తో ఫోన్‌లో మాట్లాడగా కాంటా మిషన్‌లో సాంకేతిక లోపంతో రెండు కిలోలు ఎక్కువగా చూపించి నట్లు తెలిపారు. కాంటా ప్రకారం మళ్లీ రెండు కిలోల లెక్కచేసి తిరిగి ఇచ్చినట్లు పేర్కొన్నారు.



శాబ్దిపూర్ కొనుగోలు కేంద్రంలో ఆందోళన చేస్తున్న రైతులు

తాగునీటి సమస్యా..? కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులా!

- **పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు**
- **అందుబాటులో టోల్ ఫ్రీ నంబర్ 18004256644**

కంఠేశ్వర్, ఏప్రిల్ 18 : జిల్లాలో తాగు నీటితోపాటు ధాన్యం విక్రయాల్లో రైతు లకు కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బం దులను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. టోల్ ఫ్రీ 180042566 44 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలుపవచ్చని సూచిం చారు. కంట్రోల్ రూం కార్యాలయాల పనిదినాల్లో ప్రతిరోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలి పారు. తాగునీటి సమస్య పరిష్కారానికి 7382844951, ధాన్యం అమ్మకాల్లో ఇబ్బందులుంటే 73828447 69 నంబర్‌కు వాట్సాప్ ద్వారా సమా చారం అందించవచ్చని సూచించారు. మెయిల్ ద్వారా కూడా తెలియజేయవ చ్చని పేర్కొన్నారు.